



# కణ్ణప్ప - చిన్నప్ప

*చేతికి అందివచ్చిన బిడ్డ నీటబడితే తన కొడుకు కాదుకదా అని నిర్లిప్తంగా ఉన్నాడు కణ్ణప్ప అని చిన్నప్ప సందేహించడంలో ఆశ్చర్యం లేదు. మరి కణ్ణప్ప కొడుకూ అదేస్థితిలో ఉన్నాడు. కణ్ణప్ప చలించలేదు. మనిషేనా? ఇది విషాదాంతం కావలసినదేనా?*

---

## కోమలా దేవి

"డీప్ సీ ఫిషింగ్" లో తర్ఫీతునిచ్చే కేంద్రం పుదుచ్చేరిలో ఒకటిస్థాపించింది ప్రభుత్వం. కాకినాడ, పుదుచ్చేరి, నాగపట్నం, కొచ్చిన్‌లలో ప్రత్యేకంగా లోతైన సముద్రాలలో చేపలు పట్టుకోవటానికి అనువుగా దిట్టమైన చిన్న పడవలు ఉన్నాయి. ఇవి ఒక విధమైన లాంచీల వంటివి. అన్నింటికన్నా ముఖ్యమైన విషయమేమిటంటే చదువు, సంస్కారంలేని బెస్తలు

అలాటి పడవలను సులువుగా నడపవచ్చు. కారు డ్రయివింగ్‌లా దాన్ని నడపవచ్చు. చుక్కాని, చక్రంతోపాటు ఒక తెరచాప కూడ ఉంది.

పుదుచ్చేరిలో ఉండే బెస్తల్లో కణ్ణప్ప, చిన్నప్ప అనేవారు చాల తెలివైనవారనీ, త్వరలో తర్ఫీదై సముద్రంలో దూరంగా పోయి చేపలు పట్టగలరనీ ప్రతీతి. వారి పడవ సాయంత్రం తిరిగి వచ్చిందంటే చేపలకోసం జనం ఎగబడేవారు. ఫ్రెంచివారి వల్ల ఇంకా ఈ చేపలకు మంచి బేరం లభించేది. ఆనాటి కష్ట ఫలితాన్ని పడవలోని ఆరుగురు పంచుకునేవారు. కణ్ణప్ప పడవ నడిపేవాడు. కాబట్టి కొంత అదనంగా లొక్కం ఎక్కువ దొరికేది.

పడవలోని ఈ ఆరుగురు ఎంతో ఐకమత్యంతో శ్రమపడి పని చేసేవారు. వారిలో ఏ ఒక్కరికీ అస్వస్థతగా ఉండిన సముద్రంలోకి పోకపోయినా మిగతా ఐదుగురు అతని వంతు అతని కిచ్చేవారు. ఇలాంటి స్వభావం అందరిలో లేదు. అందుకే ఈ జట్టు అంటే మిగిలినవారికి ఈర్ష్య అంటే అతిశయోక్తి కాదు.

కణ్ణప్ప, చిన్నప్ప చిన్ననాటి స్నేహితులు. వారి పల్లెకు కణ్ణప్ప పెద్ద. చిన్నప్ప అతని కుడి భుజం అనాలి. వారి స్నేహం తండ్రులనాటి నుంచి వస్తూంది. వారి సంతానం గూడా వారిలాగే ఉండాలని సర్వదా కోరుకునేవారు. కోరినట్లే కణ్ణప్ప కొడుకు పెరియదొర, చిన్నప్ప కొడుకు నరియదొర ప్రాణ స్నేహితు లయ్యారు. వారిద్దరూ కొద్దిగా చదువుకున్నవారు. అందుకే వారికా పేర్లు సార్థకమయ్యాయి. కణ్ణప్పకు ఇద్దరు కూతుళ్లు. పెద్దదాని పేరు అరుళ్, రెండవదాని పేరు కోదై.

ఆవేళ తెల్లవారుజామున పడవలన్నీ సముద్రయానంకోసం సిద్ధంగా ఉన్నాయి. సముద్రం బీభత్సంగా ఉంది. అరుణోదయం కాలేదు గానీ మసక వెలుతురులో సముద్రపు కెరటాల సవ్వడి, ఘోష అనుభవజ్ఞులైన పల్లెవారికేదో సంశయాన్ని పుట్టిస్తూంది. ఆనాటికి వారు చేపలు పట్టక వారం దాటింది. ఈ వారం రోజులు అతి కష్టంమీద వారు తమ కుటుంబాలను పోషించగలిగారు. రెండు రోజులు గాలి, వాన. ఆ తరువాత ఎడతెరిపిలేని వర్షం. పడిపోయిన గుడిసెలవారికి మిగతావారు ఆశ్రయమిస్తూ, తెరపిల్లిన కొద్దిసేపు గుడిసెలను భద్రపరుస్తూ, దాచిన డబ్బును ఖర్చుచేసి పొట్ట నింపుకుంటూ గడిపారు. ఈవేళ కాస్త నక్షత్రాలగుపిస్తూ, గాలి తీవ్రత తగ్గి, వర్షం లేకుండా ఉంది. మరి వారు చేపలు పట్టేందుకు వెళ్లాలి. లేకపోతే ఇంటిల్లిపాదీ అన్నం లేక బాధపడ్తారు. చిన్నపిల్లల ఆకలిబాధ ఏ తల్లితండ్రులు చూచి సహించగలరు ?

"ఈ తీరు చూస్తూంటేవర్షం కురిసేలా ఉంది. . ." అన్నాడు కణ్ణప్ప.

"వస్తుంది — వస్తుంది — కానీ ఇంట్లో కూర్చుంటే మనకూ, మన పిల్లలకూ గంజెవరు పోస్తారు ?" మరొక బెస్తవాని పల్కులివి.

"అంత గట్టి పడవగల మీరే అంత ఇదైపోతే మాలాటి చిన్నపడవలుగల వారమేమికావాలి" అని ఇంకొక చిన్న బెస్తవాని మాటలు.

ఇంకా పడవలు నీళ్లలోకి పోలేదు. దూరంగా కొందరి స్త్రీల రూపాలగుపించాయి. అందరూ ఆతృతతో వారివైపు చూస్తున్నారు. వారు దగ్గరకొచ్చి వారి వారి మగవారిని సమీపించి వెళ్లవద్దని బతిమాలటం మొదలెట్టారు. సముద్రంలోకి పోవద్దని వారిగోల. దాదాపు వందకు పైగా పురుషులున్నారు. అందరూ అనుభవంగలవారే — కానీ ఎందుకో అందరికీ భయంగానే ఉంది. ఈ విషమ పరిస్థితి నుంచి కణ్ణప్ప తప్పించాడు.

"నడుం కట్టండ్రా — హుం— పదండి."

"అప్పా నీవు పోతే పోయావు. వాళ్లనొద్దు" అంది పెద్ద పిల్ల దిగులుగా.

వాళ్లు అనే పదంలోని అర్థంనరియ దొరఅని. కణ్ణప్ప చిన్నగా నవ్వి— "ఫరవాలేదు —నేనున్నా కదూ? మంచి నేర్పరులు కావాలంటే ఇలాంటి భయంకరమైన సముద్రంలో పోవాలి, పెద్ద పిల్లా" అన్నాడు.

ఆమె మాత్రం దిగులుగా నించుంది. ఆడవాళ్లంతా తమ ప్రయత్నంలో విఫలులమయ్యామే అని దుఃఖంలో నించున్నారు. ఒక్కొక్కటే పడవలు నీళ్లలో ఊగుతూ తేలిపోతున్నాయి.

తెల్లవారింది. వారికా పడవలు నల్లటి చుక్కల్లా అగుపించాయి. అరుణోదయ కాంతులు సముద్రంలో ప్రతిఫలిస్తూ వింత కాంతుల్ని ప్రసరింపజేస్తున్నాయి. పెద్దదాని హృదయం ఒక్కసారి ఆనందంతో ఉప్పొంగి మరుక్షణంలో చప్పున చల్లారింది. తన వాడుతన చెంత లేడు. తెరపిల్లిన ఆకాశం, కొంతవరకు శాంతించిన సముద్రం, ఎర్రని అరుణకాంతులు వారికి కొంత తృప్తి నిచ్చాయి. తేలికపడ్డ హృదయాలతో వారంతా వారి గుడిసెల కెళ్లిపోయారు.

*   *   *   *

"చాల దూరం వచ్చేశాము—ఇక పోదామా?"

"ఒద్దు చిన్నప్పా — ఇంకొంత దూరం పోతే మంచి చేపలు దొరుకుతై."

"చేపల సంగ తటుంచు — అటు చూడు— ఆకాశం" సహ బెస్తవాడన్నాడు.

"అంతా కొద్దిసేపే — ఓరేయ్. పెరియదొరా, నరియదొరా, వల తయారుగా ఉంచండోయ్" పడవ లోపలికి విన్పించేలాగున కేకేశాడు కణ్ణప్ప.

అనుకున్నట్లే పెద్దవి ఎన్నో చేపలు పడ్డాయి. వారి అదృష్టం పండింది. కానీ ఉన్నట్టుండి ఆకాశం కారు మేఘాలతో నిండిపోయింది. మధ్యాహ్నమైంది. సూర్యుని జాడ లేదు. ఏ దిక్కు ప్రయాణం చేస్తున్నారో తెలియదు. పుదుచ్చేరి వదిలి చాల దూరం వెళ్లారు. తిరుగుముఖం పట్టామనుకుంటున్నారే గానీ అది సరైన



'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం!'

ఫోటో—ఎ. వి. వి. నరసింగరావు (కర్నూలు)

దిక్కో కాదో !

సముద్రంమీద పొగ మంచులా ఉంది. పుదుచ్చేరి లైట్‌హౌస్ గూడ తెలియటంలేదు. అందరూ కణ్ణప్పపై ఆధారపడి మౌనం దాల్చారు. మనస్సులో ప్రతివాడూ కణ్ణప్పను తిట్టిఉంటాడుగానీ పైకిమాత్రం అందరూ పెదిమలు విప్పలేదు. పడవ వెళ్ళే దిక్కునే పుదుచ్చేరి ఉందన్న ఆశతో తీక్షణంగా, వారి దృష్టి అప్పుడే మొదలుపెట్టిన వర్షధారల్లోంచి చొచ్చుకునిపోయేలా ఉంది. వర్షం జోరుగా కురుస్తూంది. హోరునగాలి,ఉరుముల భయంకర శబ్దం, తీవ్రమైన సముద్ర ఘోష, వారి చూపు నరికట్టుతు న్న వర్షధారలు, కొండంతటి అలలు వారి హృదయాల్లోని ఆందోళన నెక్కువచేశాయి.

కణ్ణప్ప ధైర్యం చిక్కబట్టి తన దృష్టిని తన ఎదురుగాఉండే సముద్రంమీదా, పడవ నడిపే చక్రంమీదా కేంద్రీకరిస్తున్నాడు. అతని హయాంలో పడవ ఒడుదుడుకులు లేకుండా అన్ని గండాలను తప్పించుకుని ముందుకు సాగుతూంది. దాదాపు రెండు గంటలఅనంతరం వర్షం తగ్గుముఖం పట్టింది. పడవలోని వారి హృదయాలు తేలికపడినై. వారి అదృష్టం, దూరంగా పుదుచ్చేరి లైట్‌హౌస్, హార్బరు అగుపించాయి.

పుదుచ్చేరి హార్బరంటే, సముద్రతీరం నుంచి సముద్రంలోకి చాలా దూరం బ్రిడ్జి కట్టారు.

# కణ్ణప్ప-చిన్నప్ప

పడవలు ఆ బ్రిడ్జి అంతం దగ్గర ఆగుతై. పెద్ద ఓడలు సముద్రంలోపల ఆగి తమ సామాను, మనుష్యుల్ని చిన్న పడవలలో పంపుతాయి. ఈ బ్రిడ్జి దాదాపు ఫర్లాంగు పొడవు ఉంటుంది. దిట్టంగా ఇనుపదిమ్మెలతో చెక్కతో నిర్మించబడింది. బ్రిడ్జికి ఎడమవైపు రాళ్లకుప్పలు సముద్రంలోంచి తొంగిచూస్తున్నట్లు పైకి అగుపిస్తాయి. ఈ రాళ్లకు కొట్టుకోకుండా ప్రతి నావికుడు జాగరూకతతో ఉండాలి. ఈ బ్రిడ్జిని సమీపించేందుకు నైరృతి దిక్కుగావచ్చి కుడికి పోవాలి. లేకపోతే సముద్ర ప్రవాహం ధాటికి వారు గమ్యస్థానం చేరటానికి చాల కష్టపడవలసి వస్తుంది.

వెంటనే కణ్ణప్ప నైరృతి దిక్కుగా పడవను పోనిస్తున్నాడు.

తలపనితలంపుగా అంతా తల్లకిందులైంది. ఒక్కసారి రివ్వుమని పెనుగాలి వీవటం మొదలెట్టింది. అనంత సముద్రంలో వలకలాంటి పడవను, పర్వతంలాంటి తరంగం తల్లకిందులు చేసినంతపని జేసింది. సరంబిమీద ఏదో సర్దుతున్న వరియదొర సముద్రంలోకి దొర్లి పడిపోయాడు !

అంతా కనురెప్పపాటులో జరిగిపోయింది. పడవలో ఉన్నవారంతా ఈ దృశ్యాన్ని చూస్తూనే ఉన్నారు. ఆ క్షణంలో ఏ ఒక్కరికీ ఏం చేయాలో తోచిందికాదు. ఒకరి మొహాలొకరు చూచుకుంటూ గుండెలు చిక్కబట్టి కణ్ణప్ప ఏంచేస్తాడో అని చూస్తున్నారు.

కణ్ణప్ప వరియదొర ఒక్క ఊపున పడవలోంచి త్రోసినట్లు పడిపోవటం చూచాడు. కొన్ని క్షణాలల్లో పడవ ముందుకు సాగింది. వరియదొర ఈదుతూ పడవ వెనకబడి దాన్ని సమీపించను యత్నిస్తున్నాడు. ఈ సమయంలో పడవ పోకడలో ఏ మార్పు వచ్చినా వారు రాళ్లకు కొట్టుకునేటట్లున్నారు. కణ్ణప్ప చేతిలో ఆరు ప్రాణాలున్నాయి. వరియదొర కోసం పడవను త్రిప్పటం అసంభవం. పోనీ వేగం తగ్గించేనా ఆ అలల పోటుకు పడవ దారి తప్పనూవచ్చు; లేదా ఆ అలల ధాటికి వరియదొరమీదికి పడవ విసురుగానూ పోవచ్చు. అతని స్థితి అడకత్తెరలోని పోకచెక్కలా ఉంది. ఎటూ తేల్చుకోలేక పడవను యథాప్రకారం నడుపుతున్నాడు.

సరంబిమీద చేరిన మిగిలిన ఆరుగురూ నీళ్లలో కొట్టుకుంటూ, పడవను సమీపించను తన సాయశక్తులా ప్రయత్నిస్తూన్న వరియదొర వైపు చూస్తూ అతన్ని రక్షించను వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్న ఒక్క రబ్బరు చక్రాన్ని నీళ్లలోకి వేశారు గానీ అతడు దాన్ని అందుకోలేకపోయాడు. పడవ దగ్గరకు చేరినట్లే వచ్చి మరుక్షణంలో ఒక్క అలమీద కొన్ని గజాల దూరం పోయిపడి అటూ ఇటూ కొట్టుకుంటున్న కుమారుని చూచి చిన్నప్ప నిలువునా నీరైపొయ్యాడు. నిస్సహాయంగా కణ్ణప్ప వైపు చూశాడు. కణ్ణప్పకిదేం పట్టినట్లు లేదు. అతని దృష్టి పడవపోకడ మీదే ఉంది. కణ్ణప్ప పరిస్థితి వారందరికీ అర్థం కాకపోలేదు. అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి.

పెరియదొర తెరచాప త్రాడుచుట్టను విప్పి నీళ్లలోకి విసరాడు. పాపం అందుకున్నట్టే అందుకుని మరో నిమిషానికంతా త్రాడుకు దూరంగా పడిపోయేవాడు. అలలు అతనితో ఆటాడుతున్నాయి. ఉన్నట్లుండి కొన్ని క్షణాలు వరియదొర అగుపించలేదు. సముద్రం మరీ బీభత్సంగా ఉంది. నల్లని మేఘావృతమైన ఆకాశానికి, సాగరానికీ ఏ భేదమూ లేదు.

"అడుగో" అని దాదాపు ఇరవై గజాల దూరంలో ఉన్న వరియదొరను పెరియదొర వారందరికీ చూపాడు. అలిసిపోయి ఈదలేక శక్తిహీనంగా నీళ్లలో మునుగుతూ తేలుతూ పోతున్నాడు.

కణ్ణప్ప వ్యధ చెప్ప నలవికాదు. అరుళ్‌కు తానేమని జవాబు చెబుతాడు ? పెళ్లి ఇంకొన్ని మాసాలేకదా ఉంది ? పాపం — వెళ్లకముందు నోరు తెరిచి అన్నది కూడా "వాళ్లొద్దు" అని. తనేగా తీసుకువచ్చింది. తమవాళ్లంతా ఆత్రంగా ఎంతో నిరీక్షిస్తుంటారు. అరుళ్ తప్పక బ్రిడ్జి

**నెలకు రూ. 200 సంపాదించండి**

ఎలెక్ట్రిక్ మరియు రేడియో గైడ్-117 చిత్రాలతో-రేడియోను రూ. 15 తో తయారు చేసుకొనడానికి లేక మరామతులు చేయడానికి ఈ చిత్రాలు తోడ్పడుతాయి. ఇదిగాక ఎలెక్ట్రిక్ మెకానిజం, వైరింగ్ వగైరాలు నేర్చుకోవచ్చు. వెల రూ. 5. టైలరింగ్ - కటింగ్ రూ. 4— ఫోటోగ్రఫీ రూ. 3. పోస్టేజి రూ. 1. ప్రతి పుస్తకం పైనా అదనం.

**ఇల్మా బుక్‌డిపో (ఏడిపి)**
రఫత్‌గంజ్, అలీఘర్ (ఉ. ప్ర.)

**కీ॥ శే॥ యఙ్ఞా సుబ్బారాయుడు**
గారిచే కూర్చబడిన వస్తుగుణదీపిక

శ్రీ రామకృష్ణా మెడికల్ బోర్డు, హైదరాబాద్ వారియొక్క 1961—62 సం:రం ఆయుర్వేద మరియు హోమియోపతి పరీక్షలకు టెక్స్టు పుస్తకముగ సెలక్షన్‌కమిటీచే నిర్ణయింపబడినది. అమ్మకమునకు సిద్ధముగ నున్నది. విడి ప్రతివెల రు. 15—00. పోస్టేజి, సేల్సుటాక్సు అదనం. వివరములకు :

**యఙ్ఞా వేణుగోపాల్‌రాయుడు,**
(రిటయర్డు కమర్షియల్ టాక్సు ఆఫీసరు)
14/176 మేడావారి వీధి, రాజమండ్రి.

అవివాహితులయిన యువకుల నుండి మాకు దరఖాస్తులు చేరినవి పెండ్లి కావలసిన యువతుల సమాచారము సేకరించుటకై యీ ప్రకటన చేయబడినది. పెండ్లి కావలసిన కుమార్తెలను కలిగిన పెద్దలు సహృదయంతో మాకు తెల్పండి.

**MARRIAGE SETTLERS**
Tanuku (W.G.) A.P.

**మంచి పుస్తకాలు**

జీవిత రహస్యాలు - మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు :- రూ 3-50
యువతి – స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు రూ 3-50.
సంతానము - గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు రూ 3 50
*అమ్మక రహస్యాలు* - వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు రూ 6-00
*ఉద్యోగదర్శిని* :- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ 5-00
*ఆత్మజ్ఞానము* :- *శరీరానంతరం ఆత్మను* గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోష్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి.పి పోస్టుద్వారా మీయింటికి పంపబడును

**దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర**

దగ్గర పడిగాపులు కాస్తూంటుంది. తను పడవను చూడగనే కొండంతాశతో అనిర్వచనీయమైన ఆనందంతో నరియదొర కోసం ఆమె వెదికినప్పుడు ఏమని జవాబు చెబుతాడు. అప్పుడు ఆమె దుఃఖాన్ని తానెలా చూడగలడు. అందులోనూ తండ్రి. దీపాలు పెట్టే రోజు ఇంక వారం కూడా లేదు. ఈ వేళ నిజంగానే మంచి చేపలు పడ్డాయి. బాగా డబ్బు వస్తుంది. పండక్కు గుడ్డలు కొనాలని సముద్ర పూజచేసి నీళ్లలో దీపాలు వదలాలని ఆడవాళ్లంతా ఏవేవో ఊహిస్తున్నారు. ఈ సంబరమంతా అరుళ్‌కు ఇక పట్టదు. ఈ దినాలిక దుఃఖపూరితం కావాలి. ఆమె జీవితమే వ్యర్థమైపోయింది. 'నా చేతులారా చేశాను. . .'

''ఓ — హెూ — కణ్ణప్పా. . .పెరియదొర దూకాడు. . .నడుముకు తాడు కట్టుకున్నాడు.''

కణ్ణప్ప పితృహృదయం ఒక్కసారి భయంతో, ఆందోళనతో పడవలా ఊగిపోయింది. కానీ మరుక్షణంలో అతనిలో ఒకవిధమైన తృప్తి, శాంతి కలిగాయి.

ఔను. లోకం దృష్టిలో తను నీచుడు కాడు.


పెరియదొర నరియదొరను రక్షించటానికి సముద్రంలోకి దూకాడు. తనపై ఏ అపవాదూ రాదు. . . .

పెరియదొర నీళ్లలోకి దూకగానే ''కణ్ణప్ప భీరువైపోయి పడవను ఆపుతాడు. లేదా వెనక్కు మళ్లిస్తాడు. లేదా అమాంతంగా రాళ్లవైపుకే తెలియకుండానే పోనిస్తాడు'' అని ఊహిస్తున్న ఇతర బెస్తల ఊహాలు పటాపంచలైనై. కణ్ణప్ప ఇదేమీ గమనించటంలేదు. మునుపులాగానే అతని దృష్టి తన ఎదురుగానే ఉంది — పడవ నైర్రుతి దిక్కుగనే పోతూంది. ఇంకా మూడు నాలుగు మైళ్లుంటుంది బ్రిడ్జి.

సరంబిమీద ఉన్న చిన్నప్ప తెలియకుండనే చిన్నగా నిట్టూర్చాడు — బహుశః పెరియదొర గూడ నీళ్లలోకి పోయినందుకు కాబోలు !

పెరియదొర మంచి ఈతగాడు. తన నడుముకు తాడు కట్టి, మరొక కొసను పడవకు కట్టాడు. తాడు పొడవు సరిపడినంతవరకు ఈదుతూ నరియదొరను సమీపించాడు. కానీ అలల పోరుకు మరుక్షణంలో ఇంకోవైపు పైకి తేలేవాడు. రెండు మూడుసార్లు నరియదొర అందినట్లే అంది చెయ్యి జారిపోయాడు. ఒకసారి గట్టిగా పట్టుకున్నాడు గానీ నరియదొరలో అంత ఓపిక లేనందువల్ల తన రక్షకుని పట్టుకుని ఉండలేకపోయాడు — పెద్ద అలఒకటి వారిద్దరినీ వేరు చేసింది.

పడవ ఒక్కొక్క అడుగు ముందుకు పోయే కొంది దానికి కట్టబడిన పెరియదొర గూడా ఒక్కొక్క అడుగే నరియదొర నుంచి దూరమవుతున్నాడు. నరియదొర ఈదటం మానేసి చాలసేపైంది. పెరియదొర పరిస్థితి అవగాహనం చేసుకొన్నాడు. తన శక్తినంతా వినియోగించి ఒక ఊపున నరియదొర వైపుకు బలంకొద్దీ ఈదాడు.



## పద్మ మహల్ (హంపి)

ఫోటో — వి. ఆర్. శాస్త్రి (విశాఖపట్టణం-౮)

''కణ్ణప్పా — ఇద్దరు బిడ్డల్నీ పోగొట్టకు— మనకు ఒక్కరినైనా మిగుల్చు...'' అన్న చిన్నప్ప మాటలు విని కణ్ణప్ప స్తంభించిపోయాడు. చేతిలోని చక్రం మాత్రం పడవను హద్దులో ఉంచుతూంది. బ్రిడ్జి ఇంకా కొన్ని ఫర్లాంగులే ఉంది. దానిపై నించున్న జనం బాగా కనిపిస్తున్నారు.

ఉన్నట్లుండి పెరియదొర అగుపించలేదు. నరియదొర చాయ అసలే లేక కొంతసేపైంది. ''ఓపిక ఉడిగి ఈదలేకపోయాడేమో ? తాడు చివర ఇంకా ఉన్నాడో లేదో — తాడు తెగలేదు కదా ? తాడు లాగి చూడండి ?'' తాడు వారి కందదు. క్రింద ఎక్కడో కట్టాడు నరియదొర. తాడు నీళ్లలో కనిపించీ కనిపించకుండా ఉంది.

కణ్ణప్ప మనసు దిటవుచేసుకుని ఒక్కసారి మాత్రం ప్రక్కకు చూచాడు — ఆశ నిరాశఅయింది. పెరియదొర కనిపించటం లేదు !

పడవ త్వరితగతిని బ్రిడ్జి సమీపించింది. బ్రిడ్జిపై వారు సంతోషంతో కేకలేస్తున్నారు.

కణ్ణప్ప కళ్లు అరుళ్‌కోసం వెదకినై. నిజంగానే ఆమె దీనంగా బ్రిడ్జి చువ్వపట్టుకుని నించుంది. ఏడుస్తూందేమో? తెలియటం లేదు.

పడవను కట్టేశారు. అయినా అది స్థిమితంగా లేదు. పడవ ఆగింది గానీ కణ్ణప్ప శిలాప్రతిమలా అల్లకల్లోలంగా ఉన్న నీళ్లవైపు శూన్యంగా చూస్తున్నాడు.

చిన్నప్ప నీళ్లలోకి ఒక్క దూకు దూకి త్రాడును కత్తితో కోసి బ్రిడ్జి నుంచి వ్రేలాడుతున్న త్రాటి నిచ్చెనను ఎక్కి రెండో చేతితో త్రాడు లాగటం మొదలెట్టాడు. అందరి దృష్టి చిన్నప్పమీదే ఉంది. ఏంచేస్తున్నాడో అర్థం కాలేదు వారికి.

త్రాడు చివర పెరియదొర గీతల చొక్కా చూచి ఆనందంతో ఒక్క కేక వేశాడు చిన్నప్ప. అప్పటికిగానీ అందరికీ చిన్నప్ప చర్య అర్థమైంది కాదు. అంతలోనే మరొక తల అగుపించింది. చిన్నప్ప అంతులేని ఆనందంతో వాళ్ల పేర్లు పిలుస్తూ తాడు లాగేశాడు. అందరూ ఉల్లాసంగా కేకలేస్తున్నారు. కణ్ణప్ప యాంత్రికంగా సరంబి చివరికొచ్చి నీళ్లలోకి చూచాడు. . . . తృప్తిగా కళ్లు మూసుకున్నాడు. . . .

''అబ్బ పెరియదొర నరియదొర కాళ్లెంత బిగువుగా కౌగలించుకున్నాడో...ప్రాణం ఉందా?'' వారిద్దరినీ మోసుకుంటూ జనం బ్రిడ్జిమీద నుంచి డూప్లే శిలాప్రతిమ మీదుగా ఆసుపత్రికి పరుగెత్తారు.

కణ్ణప్ప ఇంకా పడవ దిగలేదు. అందరితో పాటు పరుగెత్తుతున్న అరుళ్‌ను చూచి మరీ నిర్జీవిలా నిలబడిపోయాడు.

''బ్రతికి బయట పడతారో లేదో !'' ఇదే భయం అతనిలో వ్యాపించింది.

ఏదో బాధ హృదయంలో మండుతూంది. ఉన్నపాటునే కూర్చుండిపోయి మోకాళ్లమీద తల ఆన్చాడు. పడవలో ఏ సందడీ లేదు. కొద్దిగా ప్రాణంతోఉన్న చేపలే వాటి తొట్టిలో ఎగురుతున్నాయి. సముద్ర ఘోష తప్ప వేరే శబ్దమే లేదు.

ఎంతసేపైందో — ఎవరిదో చెయ్యి ఆప్యాయంగా అతని భుజంమీద ఉంది. కళ్లు తెరిచి చూచాడు.

''చిన్నప్పా'' అంటూ చిన్నప్ప భుజంమీద పడి గొల్లున ఏడవటం మొదలుపెట్టాడు. ''ఎంత పాపం చేశానో—నీ బిడ్డను. .అయ్యో!''

చిన్నప్ప కన్నీళ్లు తుడుచుకుంటూ ''ఇద్దరూ బ్రతుకుతారని డాక్టరు చెబితే విని నీకోసం వచ్చాను. . .పద. . .పోదాం'' అన్నాడు.

కణ్ణప్ప విస్తుపోయి చూస్తున్నాడు. ఆనందంతో మరొక్కసారి చిన్నప్పను కౌగలించుకున్నాడు. అతని కళ్లవెంట నీరు ఏకధారగా కారిపోతున్నది.

ఆ క్షణంలో అతనిలో ఒకటే ఆలోచన. అరుళ్ ముఖంలోకి ధైర్యంగా చూడగలడు. నరియదొర ఇడుగో అని ఆమె కప్పగించవచ్చు.

దూరంగా అతనికి పెళ్లి బాజాలు వినవస్తున్నాయి — వధువుగా అరుళ్. దీపాల పండుగ. పల్లె అంతా దీపాలే — అతని మనోనేత్రంలో ఇంకా ఎన్నో శుభసూచకమైన దృశ్యాలుఒకదాని వెంట మరొకటి దాటి పోతున్నాయి.

ఇద్దరూ పరధ్యానంగా మౌనంగా బ్రిడ్జి దాటి, డూప్లే ప్రతిమ దాటి ఆసుపత్రి వైపుకు వెళ్లారు. ★